అమ్మవారికి అభిషేకం



కీసర: బోనాల పండుగ సందర్భంగా దమ్మాయిగూడలోని పోచమ్మ ఆలయంలో శుక్రవారం నుంచి ఆదివారం వరకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. శుక్రవారం ఉదయం అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం, సీతారామ, శివాంజనేయదేవస్థానం నుంచి ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి భక్తులు పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం గర్భగుడిలో అమ్మవారి మూలవిరాట్‌కు ఒడిబియ్యం, సహస్రనామ పారాయణం, భజన తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

మొక్కల పంపిణీ



మొక్కలు పంపిణీ చేస్తున్న కమిషనర్ రాజేష్

ఘట్‌కేసర్: 100 రోజుల వనమహోత్సవంలో భాగంగా శుక్రవారం మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీలోని స్వయం సహాయక బృందం సభ్యులు, స్థానిక మహిళలకు మున్సిపల్ కమిషనర్ రాజేష్, వనమహోత్సవం ప్రత్యేకాధికారి మహేశ్వర్‌రెడ్డితో కలిసి మొక్కలు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పెరిగే వరకు సంరక్షించాలని సూచించారు. మేనేజర్ వేణుగోపాల్‌రెడ్డి, డ్వాక్రా మహిళలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా ప్రభుత్వం ఏర్పాటే లక్ష్యం

మేడ్చల్‌రూరల్: ప్రజా ప్రభుత్వం ఏర్పాటే లక్ష్యంగా పనిచేస్తానని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అన్నారు. శుక్రవారం మెదక్ పర్యటనకు వెళ్తున్న ఆయన మార్గం మధ్యలో గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని శుభం హోటల్ వద్ద ఆగారు. జిల్లా పార్టీ నాయకులతో సమావేశమై పార్టీ బలోపేతానికి కృషిచేయాలని కోరారు. జిల్లా పార్టీ అధ్యక్షుడు బుద్ది శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు విక్రమ్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు మల్లికార్జున్‌ముదిరాజ్, హంసరాణి, మేడ్చల్, గుండ్లపోచంపల్లి మున్సిపల్ అధ్యక్షులు శైలజ, శ్రీధర్ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

శామీర్‌పేట్: మజీద్‌పూర్ మాజీ సర్పంచ్ వెంకటస్వామి రోడ్డు ప్రమాదంలో గురువారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి శుక్రవారం గ్రామానికి వచ్చి వెంకటస్వామి పార్థివదేహానికి నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. శామీర్‌పేట మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, అలియాబాద్ మాజీ సర్పంచ్ కుమార్‌యాదవ్, నాయకులు వంగ వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

కలెక్టరేట్ ఎదుట
మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా



సాక్షి,మేడ్చల్ జిల్లా : మేడ్చల్- మల్కాజిగిరి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన కార్మికులకు గత 3 నెలల నుంచి జీతాలు, విద్యార్థుల భోజనానికి వారు పెట్టిన పెట్టుబడి బిల్లులు వెంటనే చెల్లించాలని కోరుతూ.. శుక్రవారం కలెక్టరేట్ వద్ద మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా నిర్వహించారు. యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు భాగ్య, తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర కోశాధికారి ఉన్నికృష్ణన్ ధర్నా కార్యక్రమానికి నాయకత్వం వహించారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన జీతం, 3 నెలలు బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా రూ. 18 వేలు మధ్యాహ్న భోజన కార్మికులకు వేతనంగా చెల్లించాలని డిమాండ్ చేశారు. భోజన కార్మికులకు వంట చేసేందుకు పాత్రలు, ఉచిత గ్యాస్ సరఫరా చేయాలన్నారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్. శ్రీనివాస్, మధ్యాహ్నం భోజనం కార్మిక సంఘం జిల్లా నాయకురాళ్లు పద్మ, విజయలక్ష్మి, మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

కుషాయిగూడ: స్మార్ట్ లివింగ్ కార్యక్రమంలో భాగంగా ఈసీఐఎల్‌లోని శ్రీ చైతన్య స్కూల్‌లో శుక్రవారం 'హరిత భారత్' కార్యక్రమం నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణకు విధిగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఏజీఎం కృష్ణ విద్యార్థులకు సూచించారు. స్కూల్ ప్రిన్సిపాల్ సునీత, డీన్ సంతోష్, జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

పేదల సమస్యలు తీర్చేలా నాయకులు ఉండాలి

'దిశ' సమావేశంలో చైర్మన్,
ఎంపీ ఈటల రాజేందర్



మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్, పాల్గొన్న జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యేలు అధికారులు

సాక్షి, మేడ్చల్ జిల్లా: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను బలహీనవర్గాల ప్రజలకు అందించడంతో పాటు జిల్లాను అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు ఎదురయ్యే సమస్యలను చర్చించి, పరిష్కరించటానికి జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు మల్కాజిగిరి ఎంపీ, కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో 'దిశ' సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో దిశ కమిటీ సభ్యులు, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మెంబర్ సెక్రటరీ జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి పాల్గొన్నారు.

డబుల్ బెడ్రూమ్ ఇళ్ల కాలనీల్లో సమస్యలపై..

జిల్లాలోని డబుల్ బెడ్రూమ్ ఇళ్ల కాలనీల సముదాయాల్లో తాగునీరు, విద్యుత్ సౌకర్యం, వీధి లైట్లు, రోడ్లు, (ఆర్టీసీ), డ్రైనేజీ వంటి మౌలిక వసతుల కొరత ఉందని, అక్కడ నివసించే ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. డబుల్ బెడ్రూమ్ ప్రాంతాల్లో కూడా లిఫ్ట్ సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలని అధికారులను కోరారు. జిల్లాలోని పలు డబుల్ బెడ్రూమ్ ఇళ్ల కాలనీల్లో నెలకొన్న ప్రధాన సమస్యలను ఈ సందర్భంగా ఈటల ప్రస్తావించారు.

పురపాలికల్లో అన్నీ సమస్యలే ..

మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లా పూర్తిగా అర్బన్ ప్రాంతమైందని, ఇందులో కొత్తగా ఏర్పడిన ఎల్లంపేట, మూడుచింతలపల్లి, అలియాబాద్ పురపాలక సంఘాల్లో తాగునీరు, రోడ్లు, చెత్త, చెదారం, డ్రైనేజీ వంటి సమస్యలు పేరుకుపోయాయన్నారు. అర్బన్ బాడీస్‌పై ముఖ్యంగా మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలపై కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు. పురపాలక సంఘాల్లోని కాలనీల్లో కమ్యూనిటీహాళ్లు ఎక్కువగా ఏర్పాటు చేయడం వల్ల స్థానిక ప్రజలకు ప్రయోజనకరంగా ఉంటుందన్నారు.

కమ్యూనిటీ హాళ్లపై..

అద్దె భవనాల్లో నివసించే వారు చనిపోతే మృతదేహాన్ని ఇంట్లో వేసుకోవటానికి ఒప్పుకోరని, అలాంటప్పుడు కమ్యూనిటీహాళ్లు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. జవహర్‌నగర్ డంపింగ్‌యార్డుతో జవహర్‌నగర్ ప్రజలతో పాటు దమ్మాయిగూడ, నాగారం, ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు.

విచ్చలవిడిగా డ్రగ్స్, గంజాయి..

జిల్లాలోని పలు ప్రాంతాలు, బస్తీల్లో డ్రగ్స్, గంజాయి మద్యం అమ్మకాలు విచ్చలవిడిగా సాగుతున్నాయని, వీటిని అరికట్టాల్సిన అవసరం అందరిపై ఉందన్నారు. ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు , అధికారులతో సహా ప్రభుత్వ వ్యవస్థలన్నీ ప్రజా సమస్యలను పరిష్కరించేలా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. దిశ సభ్యులు విక్రమ్‌రెడ్డి, నర్మదా, జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తా, డీఆర్‌డీఏ ఇన్‌చార్జ్ పీడీ కాంతమ్మ, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, జీహెచ్‌ఎంసీ పరిధిలోని మున్సిపల్ సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య

కుందన్‌పల్లిలో ప్రభుత్వ
ప్రైమరీ స్కూల్ ప్రారంభం



విద్యార్థులతో జిల్లా విద్యాధికారి విజయకుమారి

కీసర: దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని కుందన్‌పల్లి రామలింగేశ్వరనగర్ కాలనీలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా విద్యాధికారి విజయకుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఏర్పడిన జనావాసాల్లో పేదల కోసం ప్రభుత్వ పాఠశాలలను నూతనంగా ప్రారంభించి, విద్యార్థులకు చదువును బోధించడం జరుగుతుందన్నారు. రామలింగేశ్వర కాలనీలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ పాఠశాలను 1,2వతరగతి విద్యార్థులతో ఈ స్కూల్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంఈఓ జమదగ్ని, ఏఎస్‌ఓ అయ్యన్న, ఎస్‌జీటి మధుబాబు, స్థానిక ప్రజా ప్రతినిధులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

శ్రీరంగవరం పాఠశాలలో విద్యవేదిక..

మేడ్చల్: ఎల్లంపేట్ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీరంగవరం జిల్లా పరిషత్ స్కూల్‌లో జగతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విద్య వేదికను ప్రారంభించారు. శుక్రవారం వేదికను ఫౌండేషన్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు కలిసి ప్రారంభించారు. విద్యార్థుల కోసం వేదికను నిర్వహించినట్లు వివరించారు. ఫౌండేషన్ ప్రతినిధులు దుర్గాకల్యాణి, అబూబకర్, రామచంద్రమూర్తి, రత్నరాజు తదితరులు పాల్గొన్నారు.



వేదికపై విద్యార్థులతో ఫౌండేషన్ ప్రతినిధులు

ఉచిత వైద్య శిబిరం



శానిటేషన్ సిబ్బందికి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కీసర: రాష్ట్ర ప్రభుత్వం 100 రోజుల ప్రణాళికలో భాగంగా నాగారం మున్సిపల్ పరిధిలోని బోగారం వార్డు కార్యాలయంలో వైద్య శిబిరం నిర్వహించారు. కాప్రా అశోక్ ఆసుపత్రి, బోధి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ ఆధ్వర్యంలో శానిటేషన్ సిబ్బందికి పలు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. డీఈ సంతోష్‌కుమార్, వార్డు ఆఫీసర్ ధర్మారెడ్డి, వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు, అశోక్ ఆసుపత్రి, బోధి ఇన్‌స్టిట్యూట్ మెడికల్ సైన్స్ సిబ్బంది పాల్గొన్నారు.




కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

పారిశుద్ధ్య కార్మికులకు..

ఘట్‌కేసర్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ రాజేష్ శిబిరాన్ని ప్రారంభించారు. పారిశుద్ధ్య కార్మికులకు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వైద్యురాలు అనిత, ఏడీఎంసీ నరసింహ, మేనేజర్ వేణుగోపాల్‌రెడ్డి, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

రాక్‌ఉడ్స్‌లో 'ఇన్‌వెస్టిట్యూట్'



ప్రమాణ స్వీకారం చేసిన విద్యార్థి నాయకులు

కీసర: నాగారంలోని రాక్‌ఉడ్స్ స్కూల్‌లో 'ఇన్‌వెస్టిట్యూట్' వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వార్షిక విద్యార్థి మండలికి ఎన్నికైన విద్యార్థులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా విద్యార్థి మండలి నాయకులు నిర్వహించాల్సిన బాధ్యతలను స్కూల్ యాజమాన్యం వివరించారు. విద్యార్థుల ప్రతిభాపాటవాల ప్రదర్శనలతో కార్యక్రమం ఆద్యంతం ఆహ్లాదంగా కొనసాగింది. అనంతరం విద్యార్థి నాయకులను స్కూల్ చైర్మన్ రామానాయుడు, సీఈఓ సుబ్రహ్మణ్యం రంగినేని, ప్రిన్సిపాల్ పద్మ అయ్యంగార్ అభినందించారు.

కొనసాగుతున్న ఆపరేషన్ ముస్కాన్

- బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనే లక్ష్యంగా..
- చిన్నారులకు పని నుంచి విముక్తి
- ఈనెల 31వ తేదీ వరకే గడువు
- పోచారం పీఎస్ పరిధిలో 10 మంది గుర్తింపు

పోచారం: బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించేందుకు చట్టాలు వచ్చినప్పటికీ కొన్ని కుటుంబాల ఆర్థిక స్థితిగతులు సరిగ్గా లేకపోవడంతో ఇప్పటికీ కొందరు చిన్నారులు దుకాణాలు, వ్యాపారసంస్థలు, భవన నిర్మాణ పనులు చేసుకుంటూ నలిగిపోతున్నారు. చదువుకోవాల్సిన వయస్సులో పనులు చేసుకుంటూ గడిపేస్తున్నారు. చదువుపై ఆసక్తి లేని పిల్లల్లో కొందరు ఇళ్లకే పరిమితమైతే, మరి కొందరు ఇంటి నుంచి పారిపోయి ఇతర ప్రదేశాల్లో హోటళ్లు, గ్యారేజీలు, రెస్టారెంట్లు, కిరాణాదుకాణాలు, రైల్వే ప్లాట్‌ఫామ్‌లు, బస్టాప్‌లు, మతపరమైన ప్రదేశాలు, షెల్టర్ హోస్‌లు, ఇళ్లలో పనిచేసుకుంటూ విలువైన జీవితాన్ని పోగొట్టుకుంటున్నారు.

- తప్పిపోయిన పిల్లలతో పాటు బాల కార్మికులను గుర్తించి, వారికి పునరావాసం కల్పించడానికి ఆపరేషన్ ముస్కాన్ కొనసాగుతోంది. నెల రోజుల పాటు ఏటా జూలై 1 నుంచి 31వ తేదీ వరకు ఆపరేషన్ ముస్కాన్ పేరుతో ఓ ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోంది. దీనిలో భాగంగా పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇప్పటికే 10 మంది బాల కార్మికులను పని ప్రదేశాల్లో గుర్తించి వారికి పని నుంచి విముక్తి కల్పించి యజమానులపై కేసులు నమోదు చేశారు.

లక్ష్యాలు..

- తప్పిపోయిన పిల్లలను గుర్తించి, పునరావాసం కల్పించడం
- బాలల సంరక్షణ కార్యకలాపాలను రూపొందించడం
- తప్పిపోయిన పిల్లల పరిస్థితులను పరిష్కరించడం
- సమగ్ర బాలల సంరక్షణ పథకాన్ని మెరుగుపర్చడం
- ప్రజలలో అవగాహన పెంపొందించడం

పోచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో...

ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాన్ని అమలు చేసేందుకు పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌ఓ) ఆధ్వర్యంలో ఓ బృందం ఏర్పాటైంది. ఈ బృందంలో ఎస్సైలు, కానిస్టేబుళ్లు, ఎస్‌ఓటీ పోలీసులు ఉన్నారు. ప్రతిరోజు పని ప్రదేశాల్లో వీరు తనిఖీలు నిర్వహిస్తూ.. బాలకార్మికులను గుర్తించి, బాలల సంరక్షణశాఖ అధికారులకు అప్పగిస్తున్నారు.

తల్లిదండ్రులకు అవగాహన...

పిల్లలను పనికి పంపకూడదని తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తూనే.. చిన్నారులతో పనిచేయించే యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రచారం చేస్తున్నారు. ఆపరేషన్ ముస్కాన్ ఫలితంగా తప్పిపోయిన పిల్లలు తిరిగి వారి కుటుంబాల చెంతకు చేరుతున్నారు.



నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

జవహర్‌నగర్: విద్యుత్ ఫీడర్ల మరమ్మతుల కారణంగా బాలాజీనగర్ సబ్‌స్టేషన్ 11కేవీ సాయిబాబా ఫీడర్ పరిధిలో శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పలు కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ సాంబశివరావు తెలిపారు.

ఘట్‌కేసర్: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా ఘట్‌కేసర్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ యశ్వంత్‌కుమార్ తెలిపారు. యంనంపేట్, ఇస్మాయిల్‌ఖాన్‌గూడలో ఉదయం 10 గంటల నుంచి 11.30 గంటల వరకు, ఘనాపూర్ పారిశ్రామిక వాడలో ఉదయం 10.00 నుంచి 10.30 వరకు, బాలాజీనగర్‌లో 11.30 గంటల నుంచి ఒంటి గంట వరకు, కొండాపూర్ గ్రామంలో మధ్యాహ్నం 12 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, అవుషాపూర్‌లో మధ్యాహ్నం 2.00 నుంచి సాయంత్రం 5 గంటల వరకు, ఘట్‌కేసర్‌టౌన్‌లో మధ్యాహ్నం 3.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

శామీర్‌పేట్: మున్సిపల్ నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని తూంకుంట మున్సిపల్ కమిషనర్ ఎంఎస్‌ఆర్. జ్యోతి అన్నారు. తూంకుంట పురపాలక సంఘం పరిధిలోని 16వ వార్డు దేవరాయంజాల్ (ఎలిగలగూడ)లో రోడ్డు పక్కన బహిరంగ ప్రదేశంలో చెత్తను తగులపెట్టిన వారికి మున్సిపల్ సిబ్బంది రూ.2500 జరిమానాను విధించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఎన్జీటీ నిబంధనలను బేఖాతరు చేసి బహిరంగ ప్రదేశాల్లో చెత్తను తగలబెట్టకూడదని, నిబంధనలను అతిక్రమిస్తే మున్సిపల్ చట్టం ప్రకారం జరిమానా తప్పదని హెచ్చరించారు. ప్రతీ షాపు యజమానులు షాపుల ముందు చెత్త కుండీల్లో వేసి పురపాలక సంఘం చెత్త బండిలోనే వేయాలని సూచించారు.

పోలీసుల ఆకస్మిక తనిఖీలు



యాప్రాల్‌లో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

జవహర్‌నగర్: జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని యాప్రాల్‌లో ఇన్‌స్పెక్టర్ సైదయ్య ఆధ్వర్యంలో శుక్రవారం వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాదకద్రవ్యాలు సరఫరా చేస్తున్న వారిపై ప్రత్యేక దృష్టి పెట్టామని, సరైన పత్రాలు లేకుండా వాహనాలు రోడ్లపై నడిపితే సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఎస్సైలు వేణుమాధవ్, నర్సిరెడ్డి, మమత, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

కీసరలో నాకా బందీ..



కీసరలో పోలీసుల తనిఖీ

కీసర: ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం సాయంత్రం నాకా బందీ నిర్వహించారు. కీసర ఓఆర్ఆర్, కీసరగుట్ట చౌరస్తా, బోగారం, శామీర్‌పేట వెళ్లే దారిలో వాహనాలను తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా నడిపే వాహనాలు, నిషేధిత వస్తువుల అక్రమ రవాణా అరికట్టడం కోసం ఈ తనిఖీలు నిర్వహించామన్నారు. ఎస్సై వెంకటేష్, నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

భారీ వర్షం.. జలమయమైన రోడ్లు



ఘట్‌కేసర్‌లో రోడ్డుపై నిలిచిన వరద నీరు

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలో కురిసిన భారీ వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. దారి కనిపించకపోవడంతో ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పట్టణంలోని కార్పొరేషన్ బ్యాంకు ఎదురుగా, సాయినగర్ కాలనీ, బుగ్గబాయి కాలనీలో భారీగా వరద నీరు నిలిచిపోయింది. పాఠశాలలు, కళాశాలల నుంచి ఇంటికెళ్లే విద్యార్థులు ఇబ్బంది పడ్డారు. కార్పొరేషన్ బ్యాంకు ఎదురుగా భారీగా నీరు నిలిచి ప్రయాణికుల రాకపోకలకు ఆటంకం ఏర్పడటంతో మున్సిపాలిటీలకు చెందిన జేసీబీ సాయంతో నీరు నిలవకుండా సాఫీగా వెళ్లేందుకు ఏర్పాట్లు చేశారు.

పురపాలికల్లో సమస్యలపై చర్చ

స్థానిక సమస్యలను
లేవనెత్తిన ప్రజా ప్రతినిధులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్

సాక్షి,మేడ్చల్ జిల్లా: ప్రభుత్వ వైద్యం, విద్యారంగ సమస్యలు, డబుల్ బెడ్రూమ్ ఇళ్లు, పురపాలక సంఘాల్లో ప్రజలకు వసతులు, భూ కబ్జాలపై సభ్యులు తీవ్రంగా ధ్వజమెత్తారు. శుక్రవారం కలెక్టరేట్ మీటింగ్‌హాల్‌లో జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశం మల్కాజిగిరి ఎంపీ, దిశ చైర్మన్ ఈటల రాజేందర్ అధ్యక్షతన జరిగింది.

సమీకృత మార్కెట్ల నిర్మాణ పనులు పూర్తి చేయండి : ఎమ్మెల్యే మల్లారెడ్డి

జిల్లాలో 13 పురపాలిక సంఘాల్లో చేపట్టిన సమీకృత మార్కెట్ల నిర్మాణ పనులు వివిధ దశల్లో పెండింగ్‌లో ఉన్నాయి. వాటిని త్వరలో పూర్తిచేయాలని మేడ్చల్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి సీహెచ్. మల్లారెడ్డి అన్నారు. జిల్లాలో జీహెచ్‌ఎంసీ అధ్వర్యంలో 40 వేల డబుల్ బెడ్రూమ్ ఇళ్ల నిర్మాణాలు చేపట్టాం. ఇందులో 10 శాతం స్థానికులు కేటాయించాలని కోరారు. మున్సిపల్ కమిషనర్లు అభివృద్ధి కార్యక్రమాలకు తనను ఆహ్వానించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎస్‌ఆర్ నిధులతో పాటు ప్రైవేట్ విద్యాసంస్థల సహకారంతో జిల్లాలోని ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయాలని కోరారు.

భూకబ్జాలను అరికట్టాలి : మల్కాజిగిరి ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి

మల్కాజిగిరిలోని సర్వే నెంబర్లు 582, 583, అల్వాల్ జొన్నబండ సర్వేనంబర్ 22, 23ల్లో భూ ఆక్రమణలు పెరుగుతున్నాయని, వాటిని అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. సర్వే నెంబర్ 844లో ఏడీ సర్వే చేయించి జిల్లా, నియోజకవర్గాల హద్దులు నిర్ణయించాలని కోరారు. జిల్లా అర్బన్ ప్రాంతంగా మారడంతో ఉపాధిహామీ జాబ్‌కార్డులు ఉన్న వారికి ఏ విధమైన ప్రత్యామ్నాయం చూపిస్తారో చెప్పాలన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కాలేజీకి స్థలం కేటాయించాలి : ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

ఉప్పల్‌లోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీకి స్థలం కేటాయించాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కోరారు. 100 పడకల ప్రభుత్వాసుపత్రి నిర్మాణానికి టెండర్లు పిలిచినప్పటికీ, స్థలం లేక ఆగిపోయిందన్నారు. వెంటనే స్థలం కేటాయించాలని కోరారు. కాప్రా తహసీల్దార్‌పై కబ్జాదారుల అరాచకాన్ని ఆయన ఖండించారు. ప్రభుత్వ భూములను పరిరక్షించే వారికి రక్షణ కల్పించాలని కలెక్టర్‌ను కోరారు. డబుల్ బెడ్రూమ్ కాలనీల్లో ప్రజలకు కనీస వసతులు కల్పించాలన్నారు. రెవెన్యూ కార్యాలయాల్లో ఖాళీగా ఉన్న సిబ్బంది పోస్టులను భర్తీ చేయాలని కోరారు.

పూర్తయిన ఇళ్లను కేటాయించండి : సభ్యుడు విక్రంరెడ్డి

జవహర్‌నగర్ తదితర ప్రాంతాల్లో గతంలో ప్రభుత్వం నిర్మించిన రాజీవ్ స్వగృహ, గృహకల్ప ఇళ్లను అర్హులైన వారికి కేటాయించాలని దిశ సభ్యుడు పటోళ్ల విక్రంరెడ్డి కోరారు. యువతకు ఉపాధి అవకాశాలు పెంచాలన్నారు.

ప్రభుత్వాసుపత్రుల్లో సమయ పాలన లేదు : సభ్యురాలు నర్మదా

జిల్లాలోని పలు బస్తీ, పల్లె దవాఖానాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, సిబ్బంది సమయ పాలన పాటించడం లేదని దిశ సభ్యురాలు నర్మదా తెలిపారు. అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలన్నారు. ఉదయం, సాయంత్ర వేళల్లో దవాఖానాలు తెరిచి ఉంచితే పేద ప్రజలకు ప్రయోజనకరంగా ఉంటుందన్నారు.